## క్లుప్తంగా

### నా జన్మ ధన్యమైందన్నా..

- సీఎం రేవంత్‌రెడ్డిని ఆత్మీయ ఆలింగనం చేసుకున్న 'ఆది'


సీఎంను ఆలింగనం చేసుకుంటున్న ఆది శ్రీనివాస్

**వేములవాడ/ వేములవాడ రూరల్:** ఎన్నో ఏళ్లుగా వెనుకబడిన వేములవాడ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం రూ.679 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ఆలయ విస్తరణ పనులకు మోక్షం కలిగించడంతో నా జన్మధన్యమైందంటూ ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డిని ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఆలయ విస్తరణ, వేములవాడ పట్టణంలో రోడ్ల విస్తరణ తన హయాంలో జరగడం ఆనందంగా ఉందంటూ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

### 'ఆది'తో నాకు 35 ఏళ్ల అనుబంధం


వేములవాడ సభలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్

**వేములవాడరూరల్:** వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో నాకు 35 ఏళ్ల అనుబంధం ఉందని పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. వేములవాడ సీఎం సభలో ఆయన మాట్లాడారు. వేములవాడరూరల్ మ ర్రిపల్లి అమ్మమ్మ గ్రామం కాగా కథలాపూర్ మండలం కలికోటలో నానమ్మ ఊరని ఆయన గుర్తుచేశారు. ఈ ప్రాంతంతో నాకు ఎనలేని అనుబంధం ఉందని ఆది శ్రీనివాస్ ఆరోజు నుంచే నాకు మంచి మిత్రుడని ఆయన గుర్తుచేశారు.

### ఆత్మగౌరవ సభ కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

**సిరిసిల్లటౌన్:** జిల్లా కేంద్రంలో ఈనెల 23న నిర్వహించే మాలలు, ఉపకులాల ఆత్మగౌరవ సభ కరపత్రాలను మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు బుధవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. రాష్ట్రంలో మాలలు, ఉపకులాలు అన్ని రంగాల్లో వెనుకబడి పోయారన్నారు. సిరిసిల్ల లహరి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు. సభకు ముఖ్య అతిథిగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, మేడిపల్లి సత్యం హాజరవుతారని పేర్కొన్నారు. రాకం రాజేశ్, గొట్టె లింబయ్య, బూర సురేశ్, అచ్చు వెంకట్, బండ వెంకటేశ్, రాకం మహేందర్, రాజశేఖర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

### వరి కొయ్యలు కాల్చొద్దు


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో

**గంభీరావుపేట:** పంటపొలాల్లో రైతులు వరి కొయ్యలు కాల్చవద్దని మండలంలోని నర్మాల క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణాధికారి ప్రవీణ్ సూచించారు. రైతువేదికలో సమావేశం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. భూసారం కోల్పోయి దిగుబడి తగ్గుతుందన్నారు. పొలాన్ని కలియ దున్నుకోవాలని సూచించారు.

### రెడ్డి సంక్షేమానికి కృషి



**ఎల్లారెడ్డిపేట:** రెడ్డిల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషిచేయాలని రెడ్డి సంఘం అధ్యక్షుడు మోతే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నారాయణపూర్ రెడ్డి సంఘం నూతన పాలకవర్గం సభ్యులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. నూతన సంఘం అధ్యక్షుడిగా మోతే మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గోగూరి ప్రభాకర్‌రెడ్డి, రైటర్‌గా మోతే పర్శరాం రెడ్డి, కోశాధికారిగా నిమ్మ బుచ్చిరెడ్డి, సెక్రటరీ వంగల రాజుకుమార్, జాయింట్ సెక్రటరీగా కోల రాజిరెడ్డిలు ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గం సభ్యులను ఘనంగా సన్మానించారు.

### గ్రామైఖ్య సంఘం భవనం ప్రారంభం

**గంభీరావుపేట:** మండలకేంద్రంలోని దోసల గూడెంలో బీఆర్ అంబేడ్కర్ గ్రామైఖ్య మహిళా సంఘం భవనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, గ్రామైఖ్య సంఘం మహిళలు, సీఏ శైలజ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# చిగురించిన ఆశలు

- ఏడాదిలో కాళేశ్వరం ప్యాకేజీ – 9 పనుల పూర్తికి సర్కారు హామీ
- అన్నదాతల హర్షం


ముస్తఫానగర్ గ్రామశివారులో అసంపూర్తి పనులతో బట్టల చెరువు రిజర్వాయర్

**గంభీరావుపేట :** కాళేశ్వరం ప్యాకేజీ–9 పై అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. బుధవారం వేములవాడలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ ప్యాకేజీ–9 పనులపై స్పష్టత ఇచ్చారు. ప్యాకేజీ–9లో మల్కపేట రిజర్వాయర్ నుంచి ఎల్లారెడ్డిపేట మండలం సింగసముద్రం, గంభీరావుపేట మండలం బట్టల చెరువు రిజర్వాయర్ ద్వారా నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టుకు కాళేశ్వరం జలాలు రావాల్సి ఉంది. అయితే ప్యాకేజీ–9 పనులు పెండింగ్‌లో పెట్టి 10,11వ ప్యాకేజీల ద్వారా సిద్దిపేట జిల్లాకు నీరు తీసుకెళ్లారని స్థానిక రైతుల్లో కొంతకాలంగా అసంతృప్తి నెలకొంది. ప్యాకేజీ–9 పనులు ఇప్పటికే 83శాతం పూర్తయ్యాయి. మరో ఏడాదిలో రూ.340 కోట్లతో పనులు పూర్తి చేసి సాగునీరందిస్తామని సాగునీటి పారుదల శాఖ మంత్రి హామీ ఇచ్చారు. ఈ నెలాఖరులోపు మళ్లీ జిల్లాకు వచ్చి పనులపై సమీక్షిస్తానని ప్రకటించారు. అలాగే 9,10,11 ప్యాకేజీ పనులు పూర్తి చేసి లక్షన్నర ఎకరాల భూములకు నీరందిస్తామని సీఎం ప్రకటించడంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

### రైతులు రుణపడి ఉంటారు



ప్యాకేజీ–9 పనులు పూర్తి చేసి ఎగువమానేరుకు శాశ్వత జలకళ తెస్తే ఇక్కడి రైతులు ప్రభుత్వానికి రుణపడి ఉంటారు. పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డిలకు రైతుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. – హమీద్, గంభీరావుపేట

## సీఎం సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు


వేములవాడ అర్బన్ : బైక్ ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు


గంభీరావుపేట: సభకు తరలుతున్న మహిళలు

**వేములవాడఅర్బన్:** వేములవాడలో జరిగిన సీఎం సభకు వేములవాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆరెపల్లి, సంకెపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేములవాడ వరకు బైకు ర్యాలీతో వచ్చారు.

**సిరిసిల్ల ఎడ్యుకేషన్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటన సందర్భంగా తంగళ్లపల్లి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, వేములవాడ వరకు భారీ ర్యాలీతో వెళ్లారు.

**వేములవాడరూరల్:** వేములవాడలో జరిగిన సీఎం సభకు వేములవాడ రూరల్ మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు భారీఎత్తున తరలివచ్చారు. వేములవాడ నియోజకవర్గంతో పాటు సిరిసిల్ల, చొప్పదండి నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళాసంఘాల సభ్యులు పెద్దఎత్తున తరలివచ్చారు.

**రుద్రంగి:** వేములవాడలో నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు మండలకేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు భారీగా తరలివెళ్లారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

**ఎల్లారెడ్డిపేట:** సీఎం సభకు మండలం నుంచి సుమారు రెండు వేలమంది ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు తరలివెళ్లారు. మండలంలో 9వ ప్యాకేజీ పనులపై ముఖ్యమంత్రికి వివరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**గంభీరావుపేట:** రాష్ట్ర ప్రభుత్వం వేములవాడలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు గంభీరావుపేట మండలం నుంచి మహిళలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. మహిళా సంఘాల సభ్యులు బుధవారం ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

**ముస్తాబాద్:** వేములవాడ సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు ముస్తాబాద్ కాంగ్రెస్ శ్రేణులతోపాటు స్వశక్తి సంఘాల మహిళలు పెద్ద ఎత్తున బుధవారం తరలివెళ్లారు. స్వశక్తి సంఘాల మహిళలు ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు. అలాగే కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

**బోయినపల్లి:** మండలంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, ప్రజలు, మహిళలు సీఎం రేవంత్‌రెడ్డి సభకు తరలారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి వాహనాలతో వేములవాడకు తరలి వెళ్లారు.

**కోనరావుపేట:** సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండలంలోని అన్నిగ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా ఆధ్వర్యంలో గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

**ఇల్లంతకుంట :** వేములవాడలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు.

### అన్నా వదిన ఒకేచోట



పలు అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు సీఎం రేవంత్ రెడ్డి బుధవారం వేములవాడకు వచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు, ఆయన సతీమణి రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ సీఎంకు ఒకే చోట స్వాగతం పలికారు. దీంతో అన్న వదిన ఒకే చోట స్వాగతం పలకడం ఆనందంగా ఉందని చెప్పగా శ్రీధర్‌బాబు– శైలజారామయ్యర్ దంపతులు హర్షం వ్యక్తంచేశారు. – వేములవాడ

## సమయానికి బస్సులు రాక విద్యార్థుల ఇబ్బంది


పాఠశాలకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు

**వీర్నపల్లి:** మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రోజూ వందలాది సంఖ్యలో వన్‌పల్లి, శాంతినగర్, గర్జనపల్లి, మద్దిమల్ల, బంజారా గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. సమయానికి బస్సులు రాకపోవడంతో రోజూ ప్రార్థన సమయానికి, పదో తరగతి విద్యార్థులు సకాలంలో హాజరుకావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల డిపో మేనేజర్ స్పందించి మండలకేంద్రానికి ఉదయం 8 గంటలకు, సాయంత్రం 5 గంటల వరకు బస్సు సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## సంక్షిప్త వార్తలు

**● సీఎం వస్తే ప్రైవేటు పాఠశాలలకు సెలవెందుకు ?**

**ఇల్లంతకుంట :** వేములవాడలో సీఎం సభ నిర్వహిస్తే జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటించడం శోచనీయమని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అన్నారు. సీఎం సభ సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించడం విడ్డూరమని, గతంలో ఎన్నో సమావేశాలు జరిగినా ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించలేదన్నారు. ఇక ముందు ఈ విధానాన్ని మానుకోవాలని కోరారు.

**● నేడు చెకుముకి టాలెంట్ టెస్ట్**

**ముస్తాబాద్:** మండలకేంద్రంలో మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను గురువారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి మార్వాడి గంగరాజు తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలోగా ఆసక్తిగల విద్యార్థులు హెచ్‌ఎంకు రిపోర్టు చేయాలన్నారు. 1.30 గంటలకు తెలుగు, ఆంగ్లంలో వేర్వేరుగా పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రం అందజేస్తామన్నారు.

**ఎల్లారెడ్డిపేట:** మండలస్థాయిలో ప్రతి పాఠశాలనుంచి 8–10వ తరగతి వరకు గురువారం చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి మర్వాడి గంగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనాలన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

**వీర్నపల్లి:** మండలకేంద్రంలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను మండలకేంద్రంలో గురువారం నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక మండల ఇన్‌చార్జిలు నాగిళ్ల రమేష్, కులేరి ప్రేమ్‌సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు.

**ఇల్లంతకుంట :** మండలంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ వి. మహేశ్ చంద్ర తెలిపారు. మధ్యాహ్నం ఎంఆర్‌సీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని కోరారు.

**● సభలో స్థలం దొరకక ఇబ్బంది**

**వేములవాడరూరల్:** వేములవాడ పట్టణానికి సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం రావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు పలు గ్రామాల నుంచి బహిరంగ సభకు అన్ని నియోజకవర్గాల నుంచి దాదాపు 50వేల మందిని తరలించాలని ప్రణాళిక రూపొందించారు. కానీ నాయకుల అంచనాలకు మించి జనం తరలిరావడంతో సభ ఆవరణలో వచ్చిన జనానికి కుర్చీలు లేక, స్థలం సరిపోక కొంతమంది మధ్యలోనే ఇంటిముఖం పట్టారు.

**● ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం**

**సిరిసిల్ల ఎడ్యుకేషన్:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణలో మాలలకు అన్యాయం జరిగిందని, దీన్ని సరి చేయాలంటూ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. ఆయన చేపట్టిన పాదయాత్ర బుధవారం తంగళ్లపల్లి మానేరు బ్రిడ్జి వద్దకు చేరుకోగా మాలలు హాజరై స్వాగతం పలికారు. పరశురాం, మ్యాకల సుధీర్, లింగం దేవరాజు, లింగం శ్రీనివాస్, లింగం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిని సందర్శించిన ప్రిన్సిపల్ సెక్రటరీ


పరిశీలిస్తున్న వైద్య విధాన పరిషత్ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియనా ఛాంగ్టు

**సిరిసిల్ల:** వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టియనా ఛాంగ్టు బుధవారం సందర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా వేములవాడకు వచ్చిన ఆమె ప్రాంతీయ ఆస్పత్రిని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆమె కోరారు. ఆస్పత్రి వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. ఆమె వెంట ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ పి.పెంచలయ్య, డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### సన్మానం


సావిత్రిని సన్మానిస్తున్న అక్కరాజు శ్రీనివాస్, రజక సంఘం నాయకులు

**సిరిసిల్ల:** ఆంధ్రప్రదేశ్ రజక ఫెడరేషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు తీసుకున్న అడ్వొకేట్ సి. సావిత్రిని రాష్ట్ర రజక సంఘాల మాజీ అధ్యక్షుడు, ముస్తాబాద్ మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్ బుధవారం సన్మానించారు. విజయవాడలో ఆమెను కలిసి వేములవాడ రాజన్న ప్రసాదాన్ని అందించి సన్మానించారు. ఆయన వెంట జిల్లా రజక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మైలారం రాము, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు కంచర్ల నరసింహులు, సిరిసిల్ల పట్టణ రజక సంఘం అధ్యక్షులు దండు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### 24న ఉచిత వైద్యశిబిరం

**సిరిసిల్లటౌన్:** జిల్లా వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ఈనెల 24న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సెస్ చైర్మన్, మండలి అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి గుజ్జునేని వేణుగోపాల్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలకు సిరిసిల్ల విద్యానగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరం నిర్వహించనున్నారని, పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొనాలని కోరారు.

### సభకు తరలిరావాలి


మాట్లాడుతున్న మాల మహానాడు సభ్యులు

**ఇల్లంతకుంట:** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న జరిగే భారీ బహిరంగ సభకు మాలలు తరలిరావాలని మండల మాల మహానాడు సంఘ సభ్యులు కోరారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు సభ్యులు బుధవారం మండలకేంద్రంలో సమావేశమయ్యారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళిఅర్పించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ చేపట్టిన పాదయాత్రకు మద్దతు ప్రకటించారు.

### బిల్లు రాలేదని వంటగదికి తాళం



**కోనరావుపేట:** మండలంలోని ధర్మారం ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంటగదికి కాంట్రాక్టర్ తాళం వేశారు. పాఠశాలలో వంటగది నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు కాగా గ్రామానికి చెందిన ఇప్పరాములు నిర్మించాడు. అయితే అతనికి రూ. 2.5 లక్షల బిల్లు వచ్చింది. మిగ బిల్లు రాలేదని నిర్మించిన వంటగదికి తాళం వేశాడు. దీంతో నిర్వాహకులు చెట్ల కిందనే మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్నారు.



**ముస్తాబాద్:** మండలంలోని చీకోడు నుంచి ముచ్చర్ల వెళ్లే రహదారిలో మల్లన్నసాగర్ కెనాల్ ఉంది. ఇది లోతుగా ఉండగా, కెనాల్‌పై నిర్మించిన వంతెనకు ఎలాంటి రక్షణ గోడ నిర్మించలేదు. ఏమాత్రం నిర్లక్ష్యంగా వేగంగా వాహనాలు నడిపినా వంతెనపై నుంచి కెనాల్‌లో పడే ప్రమాదం ఉంది. వెంటనే రక్షణ గోడ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :**
**- రవికుమార్, డీఈఈ, సెల్ నెంబర్: 9963555560**

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

**మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626**

## సభకు తరలివచ్చిన మంత్రులు


సమావేశానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్, మంత్రులు

**వేములవాడరూరల్:** ముఖ్యమంత్రి హాజరయ్యే సమావేశాలకు సీఎంతో పాటు ఒక్కరిద్దరు మంత్రులు హాజరవుతారు. కానీ రాజన్న ఆలయానికి బుధవారం పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండ సురేఖ, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జాతీయ మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, బల్మూరి వెంకట్‌లు హాజరయ్యారు. ఇప్పటి వరకు వేములవాడ చరిత్రలోనే సీఎంతో పాటు ఇంతమంది మంత్రులు హాజరవడం మొదటిసారని గ్రామంలో చర్చించుకుంటున్నారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ నాలుగుసార్లు ఓటమిపాలై ఐదోసారి భారీ మెజార్టీతో గెలిచిన వెంటనే రేవంత్ రెడ్డి ఆయనకు ప్రభుత్వ విప్ అప్పగించారు. వేములవాడలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రిని తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని పలు సందర్భాల్లో ప్రజలకు హామీ ఇచ్చారు. బుధవారం పలు అభివృద్ధి పనులకు సీఎం, పలు శాఖల అధికారులతో పట్టణంలో భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు


బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులు


ముస్తాబాద్ ఠాణాలో బీఆర్‌ఎస్ నాయకులు

**సిరిసిల్ల ఎడ్యుకేషన్:** సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటన నేపథ్యంలో తంగళ్లపల్లి బీఆర్‌ఎస్ మండల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మాట్ల మధు, మాజీ జెడ్పీటీసీ కోడిఅంతయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

**ముస్తాబాద్:** మండలంలో బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, యువజనశాఖ అధ్యక్షుడు శీలం స్వామి, ఎల్లం, బీజేపీ నాయకుడు శ్రీనివాస్‌రావును అదుపులోకి తీసుకున్నారు.

**ఎల్లారెడ్డిపేట:** వేములవాడలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ నిర్వహించనుండగా మంగళవారం అర్ధరాత్రి బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులున్నారు.

**ఇల్లంతకుంట:** మండలంలోని బీఆర్‌ఎస్ మాజీ సర్పంచులు, ఏబీవీపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రహీంఖాన్‌పేట మాజీ సర్పంచ్ బిల్లవేని పరుశురాం, వంతడుపుల మాజీ సర్పంచ్ కట్ట వెంకటరెడ్డి, వల్లంపట్ల మాజీ సర్పంచ్ కట్ట అనసూయ వెంకట నరసింహారెడ్డి, ముస్కానిపేట, ఓబులాపురం, కిష్టారావుపల్లె, గ్రామాల మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్నారు.

**బోయినపల్లి:** సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ పర్యటన సందర్భంగా వేములవాడ మున్సిపాలిటీకి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను వేములవాడ పోలీసులు ముందస్తు అరెస్టు చేసి బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, పార్టీ పట్టణ కార్యదర్శి కందుల క్రాంతి, అర్బన్ మాజీ జెడ్పీటీసీ మ్యాకల రవితో పాటు, బీజేపీ నాయకులు ప్రశాంత్, మధు, వేములవాడ, బోయినపల్లి మండలాల మాజీ సర్పంచులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**కోనరావుపేట:** మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులను పోలీసులు అదుపులో తీసుకున్నారు. మాజీ సర్పంచులు వెన్నమనేని వంశీకృష్ణరావు, మల్యాల దేవయ్య, కదిరె శ్రీనివాస్‌లతో పాటు తదితరులను అదుపులోకి తీసుకున్నారు.

**చందుర్తి:** మండలంలోని బీఆర్‌ఎస్, నాయకులు, మాజీ సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెండింగ్ బిల్లుల కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు పాసులు అందించి నమ్మించి అరెస్టు చేశారని మండలంలోని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ నాయకులు చిలుక పెంటయ్య, మాజీ వైస్‌ఎంపీపీ అబ్రహం పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు సిరికొండ ప్రేమలత శ్రీనివాస్, లింగంపల్లి తదితరులున్నారు.

**రుద్రంగి:** మండల బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



**సిరిసిల్ల ఎడ్యుకేషన్:** తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నక్కరవి ఆధ్వర్యంలో సీఎం సహాయనిధి చెక్కులను పలువురికి బుధవారం ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బుస్స స్వప్న–లింగం, గుర్రం కిషన్ గౌడ్, రాగిపెల్లి కిష్టరెడ్డి, పాల్గొన్నారు.

### పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**ఎల్లారెడ్డిపేట:** బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గరిపెల్లి ప్రభాకర్ అన్నారు. మండలకేంద్రంలో బుధవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త క్రియాశీలక సభ్యత్వం తీసుకొని పార్టీ బలోపేతానికి పాటుపడాలన్నారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంచర్ల పర్శరాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**● నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత**

**వీర్నపల్లి:** మండలకేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వీర్నపల్లి సెస్ ఏఈ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.